క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పాతగుంటూరు:గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని కూల్‌డ్రింక్స్, బేకరీ దుకాణాల్లో ఆహార పదార్థాల్ని అధిక ధరలకు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఏటీఎం సత్యనారాయణ వ్యాపారులకు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం బస్టాండ్‌లోని పలు దుకాణాల్ని ఆయన తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తున్న నాలుగు దుకాణదారులకు రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఇకపై అధిక ధరలకు విక్రయించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ విద్యార్థినులకు స్టాటిస్టిక్స్ బోధించేందుకు అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హత గల అభ్యర్థులు ఈనెల 10లోపు దరఖాస్తు చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌లో 55 శాతం కంటే ఎక్కువ మార్కులున్న వారు అర్హులని, పీజీతో పాటు నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు గల అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు కళాశాలలోని గణిత శాస్త్ర విభాగంలో దరఖాస్తుల్ని సమర్పించాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రానికి చెందిన బాలభీమసేన భీమయ్య గౌడ్ కుటుంబ సమేతంగా గతనెల 28న గుంటూరులోని భారత్‌పేట 8వ లైనులో నివసించే బంధువుల ఇంటికి వచ్చాడు. బుధవారం ఆయన కుమారుడు రామాంజయ్య (22) బంధువులకు చెందిన మరో రేకుల గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత రాజనీతి శాస్త్రశాఖాధిపతి ఎస్. తిరుపతయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు బోధనా పద్ధతుల్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకుని తదనుగుణంగా విద్యార్థుల్ని నవసమాజానికి అందించాలని తెలిపారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్యావేత్త ఈ.చంద్రయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ యునెస్కో అక్టోబర్ 5ను అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రకటించిందని గుర్తు చేశారు. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదని, సరైన ఉపాధ్యాయుడి దగ్గర కూడా అభ్యసించడం కూడా విద్యార్థి హక్కేనని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.వి సింగరయ్య ప్రసంగించారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పట్నంబజారు: ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. ఎల్బీనగర్ వాటర్ ట్యాంకుల్లో గురువారం 4, 8 డివిజన్లకు సంబంధించిన ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పరిశీలించారు. వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు, వారికి కావాల్సిన మందులు ఉచితంగా అందించడం, అవసరమైతే ఆసుపత్రికి పంపి వైద్యం అందించే ఒక గొప్ప కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారని వివరించారు. ఉచిత వైద్యంతో పాటు, సంపూర్ణ ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్ షేక్ మెహమూద్, 8వ డివిజన్ కార్పొరేటర్ ఇర్రి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత ఇర్రి సాయి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


వృద్ధుడి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. ఆమె గురువారం ఎల్‌బీ నగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాంప్‌కి వచ్చిన వారి సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైతే సచివాలయ కార్యదర్శుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోకున్నా నేరుగా క్యాంప్‌కి వచ్చి వైద్య పరీక్షలు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంప్‌లో పురుషులకు, మహిళలకు వేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. నగర ప్రజలు కూడా తమ అనారోగ్య సమస్యలపై తమ సచివాలయం పరిధిలో జరిగే సురక్ష క్యాంప్‌ల్లో వైద్యుల్ని సంప్రదించి సేవలతో పాటు వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందుకోవాలని సూచించారు. డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కోటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

పట్నంబజారు: విద్యార్థుల జీవితాన్ని బంగారుమయంగా మార్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 8వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయుల్ని దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి: ఎంపీ



పట్నంబజారు: పేదలకు మేలు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. రింగ్ రోడ్డులోని ఆయన నివాసంలో గురువారం ఫుడ్ బ్యాంక్ స్వచ్ఛంద సంస్థ ఆంధ్రప్రదేశ్ లోగో, టీషర్ట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ స్వచ్ఛందంగా పేద ప్రజలకు సాయం చేయాలనే తలంపుతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ బ్యాంకు వ్యవస్థాపకురాలు రావెళ్ల భార్గవి, సాయి, శిరీష పాల్గొన్నారు.

వైభవంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు


దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న విప్ అప్పిరెడ్డి, లాలుపురం రాము తదితరులు

పట్నంబజారు: శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాలు నగరంలో ఘనంగా జరుగుతున్నాయి. పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), మార్కెట్ బాబు, షేక్ రోషన్, మోతుకూరి వెంకటరత్నం, ఆలా సాంబశివరావు, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో చైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు యక్కల మారుతి, బోడపాటి ఉషారాణి, బూసి రాజలత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గనిక ఝాన్సీ పాల్గొన్నారు. బ్రాడీపేటలోని ఆశ్రమంలో దివ్యాంగుల నడుమ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గనిక ఝాన్సీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ జరిగింది. ఏఆర్ యుఆర్ యూత్ నేతలు అజమ్ మాలిక్, చల్లా కోటి ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని అన్ని అనాథ, వృద్ధ, దివ్యాంగుల ఆశ్రమాలలో కేక్ కటింగ్‌లతో పాటు పండ్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దాళి గిరి, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), గుంటూరు క్లస్టర్ ఇన్‌చార్జి నూనె ఉమామహేశ్వరరెడ్డి, యూత్ నేతలు సికిందర్, వంశీ, సుమంత్, సాయి, సంగీతరావు, పవన్, హర్ష, మణి, కోటి, సతీష్ పాల్గొన్నారు.

చిరునవ్వుతో ప్రయోజనాలపై నేడు అవగాహన

గుంటూరు మెడికల్: చిరునవ్వుతో అనేక ఉపయోగాలు ఉన్నాయని డాక్టర్స్ స్మైల్ క్లబ్ వ్యవస్థాపకుడు, డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 6న ప్రపంచ చిరునవ్వు దినోత్సవం సందర్భంగా ఉదయం 7 గంటలకు స్థానిక ఎస్వీఎన్‌కాలనీ పార్కులో, ఉదయం 10 గంటలకు కొత్తపేట పశువుల హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఎస్‌పీఆర్ షుగర్ హాస్పిటల్‌లో, కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని కారుమూరి హాస్పిటల్‌లో ఉదయం 11 గంటలకు, అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కాలేజీలో మధ్యాహ్నం 3 గంటలకు, పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సాయంత్రం 4 గంటలకు చిరునవ్వు ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నగర ప్రజలంతా హాజరుకావాలని ఆయన కోరారు.

కుటుంబంలో ఓటర్లందరినీ ఒకే బూత్‌లో చేర్చాలి

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా జాబితాకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలను నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి ఆదేశించారు. తన చాంబర్‌లో గురువారం ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజరీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశాల్లో వారు అందించిన ఫిర్యాదుల్ని సూపర్‌వైజర్లు పరిశీలించి, సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో అందిన ఫారాల్ని అదనపు కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్ చేశామని చెప్పారు. పెండింగ్ ఫారాల ఆన్‌లైన్‌పై బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్ పాల్గొన్నారు.


అధికారులతో సమావేశమైన కమిషనర్

ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలి

నగరంలో బహుళ అంతస్తు నిర్మాణదారులు నిర్దేశిత ఆమోదిత ప్లాన్ మేరకే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు పాటించని భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయడం కుదరని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆమె గురువారం బృందావన్ గార్డెన్స్‌లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను, పట్టాభిపురం, స్తంభాల గరువు, కన్నావారితోట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించారు. పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ సిటీప్లానర్ అజయ్ కుమార్, టీపీఎస్ రిజ్వాన పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు ప్రధాన పాత్ర పోషించాలని, వారి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. తన చాంబర్‌లో గురువారం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు, సమస్యలు, ఇతర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పది రోజుల కిందట నగరపాలక సంస్థ నుంచి కాంట్రాక్టర్ల వారీగా చెల్లించిన రూ.9.5 కోట్ల వివరాలను తెలియజేశారు. కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికే ప్రతి శుక్రవారం ఉదయం స్పెషల్ గ్రీవెన్స్ ఫర్ కాంట్రాక్టర్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కొందరు కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపుపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మధ్య అపోహలు వచ్చేలా వ్యవహరిస్తున్నారని, ఇది సరైన విధానం కాదని సూచించారు. గతంలో అకౌంట్స్ విభాగంలో జరిగిన అవినీతి వల్ల పేమెంట్ పెండింగ్‌లో ఉన్న వారికి చెల్లించడానికి ప్రభుత్వానికి లేఖ రాస్తామని, జగనన్న లే అవుట్స్‌ల్లో చేపట్టిన పనుల బిల్లుల చెల్లింపునకు హౌసింగ్ ఎండీతో మాట్లాడి త్వరలో చెల్లించేలా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఈఈ సుందర్రామిరెడ్డి, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొండా రమేష్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

నెహ్రూనగర్: పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో-ఆర్డినేటర్ కిరణ్మయి దేవిరెడ్డి తెలియజేశారు. మెగా క్లీన్ డ్రైవ్, క్లీన్ ఇండియా 3.0 కార్యక్రమంలో భాగంగా రాజాగారితోటని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ కార్యాలయం పరిసరాల్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నుంచి నెలాఖరు వరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు, పరిసర ప్రాంతాలు శుభ్రత, మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్లీన్ ఇండియా 3.0 కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు, అధికారులు

వృత్తి నిపుణుల కమిటీ సభ్యుడిగా తులసి రామచంద్ర ప్రభు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక వృత్తి నిపుణుల కమిటీ సభ్యుడిగా గుంటూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీజేపీ నేత తులసి రామచంద్రప్రభు నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని గురువారం విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తులసి రామచంద్ర ప్రభు, బీజేపీ నాయకుడు తులసి యోగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. యువత మద్యానికి బానిసలుగా మారి విలువైన జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు యువతలో వినియోగాన్ని తగ్గించే మార్గాలపై పురందేశ్వరితో చర్చించారు. పార్టీ అధ్యక్షురాలిగా ఆమె సేవల్ని కొనియాడారు.


పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తులసి రామచంద్రప్రభు